### బహుళ జాతీయ సంస్థ సినాప్సిస్‌తో..

## వీఎన్నార్ వీజేఐఈటీ ఎంఓయూ



అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్న ఇరు సంస్థల నిర్వాహకులు

దుండిగల్, అక్టోబర్ 21: వీఎన్నార్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి అంతర్జాయంగా ఎలక్ట్రానిక్స్ రంగంలో పేరొందిన సినాప్సిప్ ఈడీఏ సాఫ్ట్‌వేర్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. సినాప్సిస్ సంస్థలో యూనివర్సిటీ ప్రోగ్రామ్ స్పెషలిస్ట్ డా.సంకల్ప్ కుమార్ సింగ్, వీఎన్నార్ వీజేఐఈటీ ప్రధాన అధ్యాపకులు ఆచార్య డాక్టర్ సీడీ నాయుడు ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా కళాశాల విద్యార్థులు సినాప్సిప్ యూనివర్సిటీ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లోని కోర్సులు చదివే వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఈసీఈ విభాగాధికారి డాక్టర్ ఎస్.రాజేంద్రపసాద్, కళాశాల సంచాలకులు ఆచార్య డా.బి.చెన్నకేశవ రావు, డీన్లు పాల్గొన్నారు. ఈసీఈ విభాగాధిపతికి వివిధ విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

### చిన జీయర్ స్వామికి..

## భారత్ వరల్డ్ రికార్ట్స్‌లో స్థానం




రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని చిన జీయర్‌స్వామి ఆశ్రమంలో సమతా మూర్తి పేరిట ప్రపంచంలోనే రెండవ ఎత్తయిన విగ్రహాన్ని నెలకొల్పిన త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామికి భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. ఈ మేరకు భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు లయన్ కె.వి రమణారావు శనివారం ధృవపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అహోబిల జీయర్ స్వామి సత్యనారాయణ స్వామి, భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు లయన్ లలితారావు, నటుడు వేణు , కోటేశ్వరశర్మ, ఉమా మహేశ్వర రావు, చలపతిరెడ్డి, సుదర్శన్ గుప్త, లక్ష్మణ్, దయాకర్, లింగస్వామి, మణికంఠ, మురళి తదితరులు పాల్గొన్నారు. *- రవీంద్రభారతి, అక్టోబర్ 21*

## సీఎంఆర్ విద్యార్థుల ప్రతిభ

- **రక్షణ శాఖ ఉపయుక్త ఉపకరణం తయారీ**
- **మహారాష్ట్రలో ప్రదర్శన - ఇస్రో చైర్మన్‌తో సన్మానం**



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌తో సీఎంఆర్ విద్యార్థులు

మేడ్చల్, అక్టోబర్ 21: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని 'సీఎంఆర్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ'(సెట్) విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపారు. రక్షణ శాఖకు ఉపయుక్తంగా ఉండే పరికరాన్ని ఆవిష్కరించి, జాతీయ స్థాయిలో సాంకేతిక ప్రదర్శనలో పాల్గొని, గుర్తింపు సాధించారు. కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు హర్ష్ అమిల్‌పూర్, సందీప్, నితిన్ రక్షణకు శాఖకు అత్యంత కీలకంగా పని చేసే డ్రోన్‌ను ఆవిష్కరించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), ఎంఎల్ (మిషన్ లర్నింగ్) సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, డ్రోన్ తయారు చేశారు. ఈ ఉపకరణాన్ని మహారాష్ట్ర-పర్భనిలో టెక్‌ఎక్స్‌లరేట్ 2023 పేరుతో నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక ప్రదర్శనలో రొబోటిక్స్ విభాగంలో ప్రదర్శించారు. ప్రదర్శనలకు దేశం నలుమూలల నుంచి వందలాది ప్రాజెక్టులు రాగా, సీఎంఆర్ విద్యార్థులు తయారు చేసిన ఉపకరణానికి గుర్తింపు లభించింది. న్యాయ నిర్ణేతలు రక్షణ శాఖకు ఈ పరికరం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని గుర్తించి, ఉత్తమ ఆవిష్కరణగా ఎంపిక చేశారు. దీంతో హర్ష్ ఆధ్వర్యంలోని విద్యార్థి బృందానికి ఇస్రో చైర్మన్ నుంచి బహుమతి, సత్కారం పొందే అవకాశం లభించింది. తమిళనాడులోని రామేశ్వరంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్, ఇస్రో మాజీ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర శర్మ, అబ్దుల్ కలాం మేనల్లుడు షేక్ సలీంలు ఘనంగా సత్కరించారు.








# నగరమంతా సొంతూళ్లకు

- **పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు నగరవాసులు**
- **సందడిగా మారిన నగరంలోని ప్రధాన బస్టాండ్లు, శివారు కూడళ్లు**
- **టోల్ ప్లాజాల వద్ద భారీగా వాహనాల రాకపోకలు**




సిటీబ్యూరో, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): అసలే పండుగ, అందులో వీకెండ్ ఇంకేముంది.. కాంక్రీట్ జంగిల్‌లో విద్యా, ఉద్యోగాల దృష్ట్యా నెట్టుకొచ్చిన ఊరి జనాలు సొంతూళ్లకు బయల్దేరి వెళ్లిపోయారు. పిల్లాపాపలతో సొంతూళ్లకు వెళ్లడంతో నగర జనాభా పల్చన పడింది. పండుగ నేపథ్యంలో మూడు రోజుల ముందు నుంచే నగరాన్ని వీడుతుండగా, నగరంలోని ప్రధాన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, టోల్ ప్లాజాలన్నీ కిక్కిరిసిపోతున్నాయి. యేటా దసరా, సంక్రాంతి పండుగల కోసం జనాలు ఎక్కువ మంది సొంతూళ్లకు వెళ్లిపోతుంటారు. ఈ క్రమంలో నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు శివారు ప్రాంతాల్లోని ప్రధాన జంక్షన్లన్నీ జనాలతో సందడి నెలకొన్నాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే అమీర్‌పేట్, సనత్ నగర్, కూకట్‌పల్లి, మెహదీపట్నం, సికింద్రాబాద్, ఉప్పల్, ఎల్బీనగర్‌తో పాటు శివరాంపల్లి జంక్షన్ వాహనాలతో నిండిపోయాయి. ఇక విజయవాడ, ఖమ్మం, వరంగల్ వంటి ప్రాంతాలకు వెళ్లే ఎల్బీ నగర్, ఉప్పల్ కేంద్రాలకు చేరుకునేందుకు మెట్రో మార్గంలో ప్రయాణిస్తుండగా.. ఉదయం 11 గంటల నుంచి మొదలుకుంటే రాత్రి 9గంటల వరకు రద్దీ కొనసాగుతుంది. దీంతో నగరంలో ఇప్పటికే మెజార్టీ ప్రజలు సొంతూళ్లకు వెళ్లిపోగా, ఆదివారం మధ్యాహ్నానికి నగరం సగం ఖాళీ కానున్నట్టు తెలుస్తున్నది.

**జంక్షన్ల వద్ద తగ్గిన వాహనాల రద్దీ**

సాధారణ రోజుల్లో నగరంలోని ఖైరతాబాద్, పంజాగుట్ట, మలక్‌పేట్, ఎల్బీ నగర్, ఉప్పల్, సికింద్రాబాద్, ప్యారడైజ్ వంటి సిగ్నళ్ల వద్ద భారీగా వాహనాల రద్దీ కనిపించేది. నగరంలో జనాల సంచారం తగ్గిపోవడంతో ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రద్దీ కొంత మేర తగ్గుముఖం పట్టింది. మూడు రోజుల పాటు ఇదే తీరుగా ట్రాఫిక్ సిగ్నళ్లన్నీ బోసిపోనుండగా శివారు ప్రాంతాల్లో ఇప్పటికీ వాహనాల రద్దీ కొనసాగుతూనే ఉంది. నగరం నుంచి బయలుదేరి సొంతూళ్లకు వెళ్లేవారితో నల్గొండ వెళ్లే మార్గంలో ఉండే పంతంగి, యాదాద్రి గూడూరు, బెంగుళూర్ హైవే ఉన్న రాయికల్ టోల్ ప్లాజాలన్నీ వాహనాలతో కొంత మేర ట్రాఫిక్ నిలిచిపోతున్నంది.

## కుక్కపిల్ల ఇస్తామని 30 వేలు మోసం

వెంగళరావునగర్, అక్టోబర్ 21 : మూగజీవి పట్ల ఉన్న మమకారమే ఆ యువతి మోసపోవడానికి కారణమైంది. ఓ కుక్క పిల్లకు జబ్బున్న విషయాన్ని దాచి అధిక ధరకు అమ్మేసి కుట్రకు పాల్పడ్డారు ఆ కెన్నెల్ నిర్వాహకులు. మరో కుక్క పిల్లని ఇస్తామని కాలం వెళ్లబుచ్చి.. 'చివరకు డబ్బు ఇవ్వం.. కుక్క పిల్లని ఇవ్వం.. దిక్కున్న చోట చెప్పుకో' అంటూ బెదిరించారు. మోసపోయామని గ్రహించిన బాధిత యువతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిగూడ జయప్రకాశ్ నగర్‌కు చెందిన డి.ప్రసన్న లక్ష్మి యూట్యూబ్‌లో డీవీఎస్ కెన్నెల్‌కు సంబంధించి షిహ్ త్జు జాతికి చెందిన కుక్కపిల్ల విక్రయ ప్రకటన చూసి ఆకర్షితురాలైంది. బండ్లగూడ కాళిమందిర్ సమీపంలోని డీవీఎస్ కెన్నెల్ పెట్ షాపు నిర్వాహకులను ఫోన్‌లో సంప్రదించారు. షిహ్ త్జు జాతికి చెందిన బుజ్జి కుక్క పిల్లని గత జూన్ 1వ తేదీన రూ.30వేలకు ఆమె కొనుగోలు చేశారు. అయితే కుక్క పిల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుందని నిర్వాహకులను అడిగారు. అయితే జలుబు చేసిందని, కుక్కపిల్ల ఆరోగ్యంగానే ఉందని నిర్వాహకులు ఆమెకు చెప్పారు. వెటర్నరీ డాక్టర్‌ను సంప్రదించగా.. కుక్కపిల్లకు లంగ్స్‌లో ఇన్‌ఫెక్షన్ ఉన్నట్టు నిర్ధారించారు. దీంతో తీసుకున్న మూడు గంటల్లోనే కుక్కపిల్లను తిరిగి ఇచ్చేశారు. అనారోగ్యంతో ఉన్న ఆ కుక్కపిల్లను అమ్మడంపై షాపు నిర్వాహకుల్ని ఆమె ప్రశ్నించగా.. మరో కుక్క పిల్లని ఇస్తామంటూ కాలం వెళ్లబుచ్చారు. తన డబ్బు తనకు ఇవ్వాలని కోరగా.. పెట్ దుకాణం నిర్వాహకులు వాసు, సాయిలు దురుసుగా ప్రవర్తించి.. అసభ్య పదజాలంతో దూషించారు. దాంతో తాను మోసపోయానని గ్రహించిన ఆ బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుడిగా నేమాల బెనర్జీ

తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుడిగా నేమాల బెనర్జీ నియమితులయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం తెలంగాణ ప్రభుత్వ విద్యుత్ తనిఖీ అధికారి ఎస్.శ్రీనివాసరావు కొత్తగా నియమితులైన నేమాల బెనర్జీకి నియామక పత్రాలను అందజేశారు.

*- సిటీబ్యూరో, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ)*



## పండుగకు 11 ప్రత్యేక రైళ్లు

### 27 వరకు రాకపోకలు కొనసాగించనున్న ప్రత్యేక రైళ్లు

సిటీబ్యూరో, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): దసరా పండుగ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 11 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తూ రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 21 నుంచి 27 వరకు దసరా ప్రత్యేక రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. 'బెంగుళూరు - సంత్రగాచి, చెన్నై భువనేశ్వర్, చెన్నై - సంత్రగాచి, బెంగుళూర్ - భువనేశ్వర్, నాందెడ్ - పానిపట్, ఎర్నాకులం - ధన్‌బాద్' వంటి పలు రైల్వే స్టేషన్ల మధ్య దసరా ప్రత్యేక రైళ్లు నడుస్తాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కొండాపూర్, అక్టోబర్ 21: లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం, చందానగర్ గాంధీ విగ్రహం సమీపంలోని ముంబై జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తలతో పాటు శరీర భాగాలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతుడికి సంబంధించిన ఎలాంటి వివరాలు లభించలేదన్నారు.